# ఇక.. హోరాహోరీ ప్రచారం

- నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం
- పేలనున్న మాటల తూటాలు
- ఎన్నికల క్యాంపెయిన్‌లోకి దిగనున్న రాజకీయ ప్రముఖులు
- 15 నుంచి 22 వరకు 15 నియోజకవర్గాల్లో మంత్రి కేటీఆర్ రోడ్ షో
- 25న సీఎం కేసీఆర్ బహిరంగ సభ
- అభ్యర్థుల భారీ మెజార్టే లక్ష్యంగా అగ్ర ప్రచారంలో సత్తా చాటేలా బీఆర్ఎస్ ప్రణాళికలు


మహేశ్వరం నియోజకవర్గంలో తనకే మద్దతుగా నిలవాలని ప్రచారం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

సిటీబ్యూరో, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్నికల సెగ రాజుకుంటోంది. బీఆర్ఎస్ పార్టీ మినహా విపక్ష పార్టీల అభ్యర్థులెవరో? అన్నది సస్పెన్స్ కొనసాగింది. నేటితో నామినేషన్ల ఘట్టం ముగింపు చేరడంతో చివరి దశలో కొన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. మొత్తంగా ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. దీంతో ఏయే నియోజకవర్గంలో ఎలాంటి పోటీ జరగనుందో దాదాపు స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారంతో ముగియనుంది. దీంతో ప్రచారంపై ప్రధాన పార్టీలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. తమ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేపట్టడానికి రాజకీయ ప్రముఖులంతా రంగంలోకి దిగుతున్నారు. దాదాపు 20 రోజుల పాటు జరిగే ఎన్నికల ప్రచారంలో మాటల తూటాలు పేలనున్నాయి. సవాల్-ప్రతి సవాళ్లతో హోరెత్తనుంది. గల్లీలు, కాలనీల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలు, పాదయాత్రలతో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోనున్నారు. రెండు నెలలుగా నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనతో హోరెత్తించిన టీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ముందుంది. ఎక్కడ అసంతృప్తుల బెడద లేకుండా మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా క్యాంపెయిన్ చేస్తూ వచ్చారు. గ్రేటర్ ప్రచార బాధ్యతలు తీసుకున్న మంత్రి కేటీఆర్ ఇప్పటికే ఆత్మీయ సమావేశాలు, పార్టీ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని శ్రేణులంతా రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేలా దిశా నిర్దేశం చేశారు. క్యాడర్‌లో మరింత నయా జోష్ ఉండేలా ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 15 నియోజకవర్గాల్లో అభ్యర్థుల తరపున రోడ్ షో నిర్వహించనున్నారు. అగ్ర ప్రచారం ముగింపు సందర్భంగా 25న సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

**ఇంటింటీ ప్రచారం, పాదయాత్రలు..**

ఇంటింటీ ప్రచారం, పాదయాత్రలు ఒకవైపు మరోవైపు కలిసివచ్చే నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ నియోజకవర్గ ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలతో క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపుతూ అందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థుల గెలుపునకు ఇన్‌ఛార్జిలు, పార్టీ ముఖ్యులు, మంత్రులు బాటలు సుగమమం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పదేండ్ల అభివృద్ధి, ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా కాలనీలు, బస్తీలు కలియతిరుగుతూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీలు 65 ఏండ్లు పాలించిన అభివృద్ధి జరగలేదని, గడిచిన పదేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వందేండ్ల అభివృద్ధికి బాటలు వేసిందంటూ ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్ఎస్ ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నదన్నారు. ప్రతి వంద ఓటర్లకు ఒక ఇన్‌చార్జీని నియమించి నియోజకవర్గంలో ప్రతి ఓటరును కలుస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులంతా భారీ మెజార్టీతో గెలుపొందేలా ఎప్పటికప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికే మద్దతు..

- బీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన
- బీఆర్ఎస్ మేనిఫెస్టోపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్న ప్రజలు


మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో నిర్వహిస్తున్న మంత్రి మల్లారెడ్డి ప్రచారానికి విశేష స్పందన

మేడ్చల్, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): అభివృద్ధి-సంక్షేమానికి ప్రజలు మద్దతు ఇస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన తీరుతో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు జై కొడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో లబ్ధి పొందిన అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు మంత్రి మల్లారెడ్డి, కేపీ. వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలు నియోజకవర్గాలలో నిర్వహిస్తున్న ప్రచారానికి స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలియజేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ఇంటింటికీ తిరిగి వివరిస్తున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని అన్ని పథకాలు విజయవంతంగా అమలు చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి జరగనున్న ఎన్నికలకు ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడింది. ఇంటింటి ప్రచారంతో పాటు నిర్వహిస్తున్న రోడ్ షోలు, బహిరంగ సభలు విజయవంతంతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి స్వచ్ఛందంగా మద్దుతు ఇస్తున్నారని అనడానికిదో నిదర్శనం.

**కాంగ్రెస్, బీజేపీలో భిన్నమైన పరిస్థితి**

జిల్లాలో కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి బుజ్జగింపులతోనే సరిపోతుంది. పూర్తి స్థాయిలో ఇరు పార్టీలు ప్రచారం ప్రారంభించకపోవడంతో ఇరు పార్టీల శ్రేణులు విస్మయానికి గురవుతున్నారు. ఎన్నికలకు మరో 20 రోజుల సమయం ఉన్నందున ప్రజల వద్దకు వెళ్లి ప్రచారం ఎప్పుడు చేస్తారని కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ఇంతవరకు అభ్యర్థుల, ద్వితీయ శ్రేణి నాయకులతో సక్యత కుదరకడ పోవడంతో ప్రచారం ఎలా పుంజుకుంటుందన్న ఆందోళనను పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు కలుస్తూ ప్రజల మద్దతు పొందుతున్నారు.

## మరోసారి అవకాశమిస్తే..
# మరింతగా సేవలందిస్తా..

- ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్


ఎన్‌బీటీనగర్‌లో ఓటర్‌ను కలిసి మద్దతు పలకాలంటూ కోరుతున్న దానం నాగేందర్, చిత్రంలో మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబర్ 9: ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి అవకాశం ఇస్తే మరింతగా సేవలందిస్తూ, సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్‌బీటీనగర్‌లో గురువారం దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. బస్తీలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం, ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేయాలంటూ అభ్యర్థించారు. ఎన్‌బీటీనగర్‌లో మంచినీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని గౌరీశంకర్ కాలనీ, రామాలయం వీధి తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దానం నాగేందర్‌కు మద్దతుగా నియోజకవర్గంలోని పలువురు ప్రచారం నిర్వహిస్తున్నారు.




# కూకట్‌పల్లిలో బీజేపీకి బిగ్ షాక్

కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కౌన్‌రెడ్డి తులసి ఈశ్వర్‌రెడ్డి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆర్షితుడినై తాను బీఆర్ఎస్‌లో చేరినట్లు తులసిరెడ్డి పేర్కొన్నారు. *- కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 9*

# కాంగ్రెస్‌కు లష్కర్‌లో భారీ షాక్

**కాంగ్రెస్ పార్టీ నుంచి 60 మంది బీఆర్ఎస్‌లో చేరికలు**

సికింద్రాబాద్, నవంబర్ 9: సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. రేవంత్ రెడ్డి బహిరంగ సభ రోజే సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పని చేస్తే ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ నాయకులు వాపోయారు. కష్టపడి పని చేసే నాయకులకు గుర్తింపు లేదని చెప్పారు. బౌద్ధ నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు విజయలక్ష్మి, వెంకట్, సందీప్ కుమార్‌లతో పాటు దాదాపు 60 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ బౌద్ధ నగర్ డివిజన్ ఇన్‌చార్జ్ కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నేతృత్వంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పద్మారావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం, వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, అలాగే, సికింద్రాబాద్ నియోజకవర్గంలో పద్మారావు గౌడ్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరామని తెలిపారు.

**రేవంత్‌రెడ్డి బహిరంగ సభ రోజే పార్టీకి గుడ్‌బై**

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బహిరంగ సభ రోజే.. అదే టైంలో సికింద్రాబాద్‌లో 60 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో ఆ పార్టీకి నియోజకవర్గంలో అసమ్మతి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీకి సికింద్రాబాద్‌లో వ్యతిరేకత చాలా ఉందని పార్టీ మారిన నాయకులే స్వయంగా చెబుతున్నారు. అలాగే, టికెట్ ఆశించిన మరో ఇద్దరు నాయకులు పార్టీకి, అభ్యర్థి ప్రచారానికి దూరంగా ఉంటున్నట్లు నాయకులు చర్చించుకుంటున్నారు.


డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

# కేసీఆర్ ఆధ్వర్యంలో కనీ వినీ ఎరుగని అభివృద్ధి

- బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి


నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ ఆజం అలీ, సునరితారెడ్డితో కలిసి నామినేషన్ వేసిన సందర్భంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట, నవంబర్ 9: అభివృద్ధి చేసిన పార్టీనీ ఆదరించి తమకు ఓటు వేయాలని, ఒక్కసారి అవకాశమిస్తే మలక్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి పనుల ఫలాలు ప్రజలకు అందుతున్నాయని, సుమారు వందకు పైగా చేపట్టి అమలు పరచిన సంక్షేమ పథకాలను ప్రజలు అందుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ట్యాగ్‌లైన్‌తో ఏర్పడిన రాష్ట్రంలో అన్నీ సమకూర్చారని, ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఐటీ కంపెనీల్లో లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించారని, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో నీటి కొరత తీరటంతో పాటు రెండు పంటలతో అన్నపూర్ణగా సుభిక్షమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటంతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందని, మహానగరం విశ్వనగరంగా రూపుదిద్దుకుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తేవాలని, ప్రజలు పార్టీ అభ్యర్థులకు అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.